

ఆటలకు చోటేది?

- పాఠశాలల్లో మైదానాలు లేక ఇబ్బందులు
- పాలకుల హామీలే తప్ప కనిపించని ఆచరణ
- భర్తీ కాని వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు

జిల్లాలోని సర్కారు బడుల్లో విద్యాప్రమాణాల మాట ఎలా ఉన్నా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ఆటలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చదువుతో పాటు ఆటలు ఉన్నప్పుడే పిల్లలు మానసికంగా, ఆరోగ్యంగా ఎదుగుతారు. కానీ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆడుకునే మైదానాలు, ఆటల పరికరాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.



మినీ స్టేడియంలో కొనసాగుతున్న ఏఆర్ హెడ్‌క్వార్టర్

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆటలు అటకెక్కుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. పాఠశాలల్లో ఓ వైపువ్యాయమా ఉపాధ్యాయుల కొరత అతిగతిలేని మైదానాలతో క్రీడలకు బావి క్రీడాకారులు దూర మవుతున్నారు. దీంతో విద్యార్థులకు క్రీడలు అందని ద్రాక్షగా మిగిలిపోతున్నా యి. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నారు. ఇదిలా ఉండ గా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న మినీ స్టేడియం జిల్లా ఏర్పాటులో భాగంగా పోలీసుశాఖకు కేటాయించారు. అందులో ఏఆర్ హెడ్‌క్వార్టర్ ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోని యువకులు, క్రీడాకారులు, వాకర్స్ వ్యాయమానికి దూరమవుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగాణాలు సదుపాయాలు లేకపోవడంతో అలంకార ప్రాయంగానే మిగిలిపోతున్నాయి.

● జిల్లాలో 1,258 పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 1,258 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 908 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 170 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో సగానికి పైగా పాఠశాలల్లో క్రీడామైదనాలులేవు. ఇక వ్యాయామ విద్యను బోధించే పీఈటీ, పీఈడీ పోస్టులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోకుండా ఉన్నాయి. ప్రాథమిక స్థాయి లోనే నిర్బంద వ్యాయమవిద్య ప్రవేశపెట్టి విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదఎడే క్రీడలు వ్యాయామం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి. కానీ ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు సదుపాయాలకు నోచుకోవడం లేదు. ఈ ప్రాంగణాలు ఊరు చివర నిర్మించడం, చదునుగా లేకపోవడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఆటలు ఆడేందుకు అనువుగాలేవు. దీంతో గ్రామీణ క్రీడ ప్రాంగ ణాలు అలంకరప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామీణ క్రీడకారులు తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యతను ప్రదర్శించలేక పోతున్నారు

● మినీ స్టేడియం పోలీసుశాఖకు..

జిల్లా కేంద్రంలో ఆధునిక హంగులతో లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియంను ప్రభుత్వం పోలీసుశాఖకు కేటాయించింది. 2016లో జిల్లా ఏర్పడిన సందర్భంగా అప్పుడే పూర్తయి అందుబాటులో ఉన్న మినీ స్టేడియాన్ని పోలీసుశాఖకు కేటాయిం చడంతో ప్రస్తుతం ఆ మినీ స్టేడియంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్ ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పట్టణంలోని యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు ఆటలు అడుకునేం దుకు మైదానం లేకుండా పోయింది. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వాకింగ్, జాగింగ్ చేయాలంటే ఇబ్బందులు పడక తప్పడం లేదు. పోలీసు, ఆర్మీ ఉద్యోగాలకు సిద్ధపడే యువతకు క్రీడా మైదానం లేకపోవ డంతో ప్రాక్టిస్ కోసం ఇతర ఖాళీ స్థలాలే దిక్కావుతు న్నాయి. మినీ స్టేడియాన్ని తిరిగి అప్పగించాలని గతంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టినా చర్యలు తీసుకోలేదు.

పకడ్బందీగా అమలు చేయాలి..

- అవిడపు ప్రణయ్, జిల్లా యువజన సంఘం నాయకుడు



పాఠశాలల్లో వ్యాయామవిద్యను పకడ్బందీగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠ శాలల్లో క్రీడా మైదా నాలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవు తున్నారు. ప్రభుత్వం క్రీడా మైదానాల నిర్మాణాలతో పాటు ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి. పట్టణంలోని మినీ స్టేడి యంను తిరిగి కేటాయిస్తే క్రీడాకారులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్, బీజేపీ వ్యతిరేకం



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ నిషాని రాంచంద్రం

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యతిరేకమని, బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్, అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. స్థానికంగా ఆదివారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 43 ఏళ్లుగా బీసీలకు రిజర్వేషన్ అమలు కాకుండా కుట్ర చేస్తున్నామని బీఎస్పీ ద్వారానే మండల్ కమిషన్ అమలు అయి ఇప్పుడున్న 27 శాతం రిజర్వేషన్‌లు అమలు అయ్యాయని అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ పోరాటం వల్లనే బహుజనులకు రాజ్యాంగం ద్వారా హక్కులు లభించాయని, బీసీలకు 42 శాతం ప్రకటించిన ముఖ్యమంత్రి బీసీ రిజర్వేషన్ పట్ల చిత్త శుద్ధి లేదన్నారు. నాడు కాన్షిరాం పోరాటం వల్లనే మండల్ కమిషన్ అమలు అయిందన్నారు. మండల కమిషన్ రిజర్వేషన్లను అడ్డుకోవడానకిఇ బీజేపీ, ఏబీవీపీ విద్యార్థులకు నిప్పు పెట్టి బీసీ రిజర్వేషన్ వ్యతిరేకాందోళన చేసిందని గుర్తు చేశారు. బీజేపీ రాజ్యాంగం రద్దు కోసం కుట్ర చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకుల రజీహైదర్, తుకారాం, రాజేంద్రప్రసాద్, మదస్సీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రెబ్బెన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరా నగర్ దుర్గామాత ఆలయంలో కార్తీక మాసం ఆదివారం సందర్భంగా అమ్మవారి దేవస్థానంలో దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చింతలమానేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన అయిదుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుకారాం, మోహన్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 10, 11, 12 తేదీలలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆదివారం ఆ సంఘం నాయకులు ఆవిషకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సమీర్, సుమంత్, కృష్ణ, సాయి తేజ, గణేష్, రవితేజ, కేశవ్, మహేష్, శ్రీకాంత్, కార్తీక్, సతీష్, జశ్వంత్, అదర్ష్, కార్తీక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎఫ్ఎస్‌వో



మతిస్థిమితం లేని వ్యక్తికి కటింగ్ చేయిస్తున్న ఎఫ్ఎస్‌వో

సిర్పూర్(టి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని భిక్షాటన చేస్తూ రోడ్డుపై తిరుగుతున్న వ్యక్తికి ఎఫ్ఎస్‌వో మోహన్ సపర్యలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్ గ్రామంలో గౌత్రె తులసీరాం అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం లేక భిక్షాటన చేస్తూ గ్రామంలో తిరుగుతున్నాడు. విషయాన్ని గమనించిన ఎఫ్ఎస్‌వో మోహన్ సిబ్బందితో కలిసి మతిస్థిమితం లేని తులసీరాంను చేరదీసి క్షౌరం చేయించి స్నానం చేయించి, కొత్తబట్టలు వేయించి, భోజనం పెట్టించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు అటవీ శాఖ సిబ్బందిని అభినందించారు.

విద్యార్థికి సన్మానం



శ్రవణ్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

సిర్పూర్(టి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం టోంకిని గ్రామానికి చెందిన హివర్కర్ శ్రవణ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్ సీటు సాధించడం సంతోషకరమని, క్రమశిక్షణతో చదివి లక్ష్యం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేజర్‌హుస్సేన్, విక్రం, రాందాస్, మోహన్, ఇప్పతుస్సేన్, రరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ ముఖ ద్వారం ప్రారంభం

చింతలమానేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి గ్రామంలో గల ఓంకార ఆశ్రమ రాధాకృష్ణ మందిరంలో ముఖ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సుప్రభాత సేవ, నిత్య పూజ, విష్ణు సహస్రనామ పారాయణం, లలితా యజ్ఞం, శివరామకృష్ణ స్వామి బృందంచే ఆశ్రమ అదికారిక లోగోను ఆవిష్కరించారు. ముఖద్వార నిర్మాణ దాతలు సుశీల, శంకర్ దంపతులను భక్తులు ఘనంగా సన్మానించారు.

శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల దురహంకార హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాలి సంఘం భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌంటేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళా తలండి శ్రావణి అనే నిండు గర్భిణి హత్యకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాల ని డిమాండ్ చేశారు. హత్య జరిగి 15 రోజులు గడుస్తుఅన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆ గ్రామాన్ని సం దర్శించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించలేదని ఆరోపించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఆరు నెలల్లో నిందితులను కఠినం గా శిక్షించాలని బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా, ఐదు ఎకరాల భూమితో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డి మాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాన్నారు. ఈ నెల 10న జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సందర్భగా రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినకర్, చిరంజీవి, కార్తీక్, రాజేందర్, కృష్ణమాచారి, చిన్నయ్య, నరసింహారావు, జయరాం, రవీందర్, శంకర్, రాజు, మారుతి, టికానంద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగల దుకాణంలో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సంతోష్

బెజ్జూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ఏలేశ్వరం నరేష్‌కు చెందిన నగల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. శనివారం మండల కేంద్రంలో షాపులు బంద్ ఉండడంతో ఆదివారం ఉదయం షాపు తెరిచే సరికి పైన షెడ్డు రేకులు తొలగించి ఉండడంతో అనుమానంతో పరిశీలిం చారు. దుకాణంలో కిలో వెండితో పాటు బ్రాస్లెట్లు, చైన్లు చోరీకి పాల్పడ్డారని బాధితుడు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. కౌటాల సీఐ సంతోష్, ఎస్సై సర్తాజ్ పాషా సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దుకాణంలో సీసీ కెమెరాలను పరిశీలించగా ముఖానికి మాస్ వేసుకొని ఉండడంతో దొంగను గుర్తు పట్టలేక పోయారు. దీంతో ఆసిపాబాద్ నుంచి జాగిలాన్ని రప్పించి దొంగ కోసం గాలింపు చేపట్టారు. దుకాణంలో ఫింగర్ ప్రింట్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని పోలీసులు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ జరిపి చోరీకి పాల్పడ్డ వ్యక్తిని గుర్తిస్తామని పోలీసులు చెప్పారు. ఇప్పటికే పాత నేరస్తుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

బెజ్జూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీని ప్రభావం చేతికందొచ్చిన వరి, పత్తి పంటలకు నష్టం కలిగిస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల కోతలు పూర్తవడంతో రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తున్నారు. వర్షంతో నీట మునిగిన పంటలను సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే చాలా వరకు నష్టం తగ్గించవచ్చని బెజ్జూరు వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు.

ఇలా చేస్తే మేలు..

వరి పొలం మడుల్లో నీరు నిల్వ ఉండకుండా వచ్చిన వరద వచ్చినట్లు బయటకు వెళ్లేలా గండ్లు పెట్టాలి. ఈదురుగాలులు, వర్షం ప్రభావంతో నేలవాలిన వరి కంకులు నీటిలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం తగ్గాక కింద పడిన వరిని కట్టలుగా కట్టాలి. దీంతో నీటిలో తడిచి గింజ రంగు మారదు. కోతకు సమయం ఉన్న పంట తెగుళ్ల కట్టడికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం పిచికారి చేయాఆలి. బ్యాక్టీరియా, ఎండాకు, మాగుడు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మిల్లీటీర్లు ప్రొపికొనజోల్ చల్లాలి. కోతకు సిద్ధంగా ఉంటే లీటరు నీటిలో 5శాతం ఉప్పు ద్రావణాన్ని కలిపి చల్లాలి. ధాన్యం తడిస్తే బాగా ఆరబెట్టాలి. పత్తి పంట పూత, పిందెలు ఉంటే నీరు లేకుండా చూడాలి. వర్షం తగ్గిన వెంటనే తడి పత్తి ఏరవద్దు. మొక్కలపైనే బాగా ఆరిన తర్వాత తీయాలి. తీసిన పత్తిని పొడి ప్రదేశంలో పాలిథిన్ కకవర్‌పై ఆరబెట్టాలి. తడి పత్తిని నిల్వ చేస్తే బూజు పట్టి రంగు మారుతుంది. నాణ్యత దెబ్బ తింటుంది. పొడి గదిలోనే నిల్వ చేయాలి.

రైతులకు తీవ్ర నష్టం..



మొంథా తుపాను ప్రభావంతో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతి నడంతో తీవ్రంగా నష్టపోయారు. రైతులు వ్యవసాయ శాఖ సూచించే పలు సూచనలు పాటించాలి. పత్తి, వరి పంటలు సాగు చేసిన రైతులు పైన పేర్కొన్న సూచనలు పాటించి నట్లయితే నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

- నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు



బెజ్జూరులో వర్షాలకు నేలవాలిన వరి(ఫైల్)

ఇరుకు వంతెనలతో అవస్థలు

» తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో పలు చోట్ల ఉన్న ఇరుకు వంతెనలతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ కూడా ఇంత వరకు పురోగతి లేని పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్-ఈసుగాం వెళ్లే ప్రధాన రహదారి ఈసుగాం శివమల్లన్న ఆలయం సమీపంలో చిన్నపాటి వంతెన ఉంది. రోడ్డు వెడల్పుగా ఉండి, వంతెన మాత్రం చిన్నగా ఉండటంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్ల క్రితం ఈ వంతెన వద్ద బైక్‌తో ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే గతేడాది ఈ వంతెన వద్దనే బైక్‌పై వెళ్లతున్న క్యాంపు నంబరు 5కు చెందిన బిశ్వాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైనచికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించి వైద్యం చేయించినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. ఇరుకు వంతెనలు తొలగించి వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. ఈ ప్రాంతంలోనే రెండు మూలమలుపులు ఉండగా, అలాగే రోడ్డు వెడల్పు పెద్దగా ఉంటడం, బ్రిడ్జి మాత్రం చిన్నగా ఉండటంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఇరుకు వంతెన స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదాలు జరుగుతున్న ఇరుకు వంతెన

అధికారులు చర్యలు తీసుకోవాలి..



అధికారులు చర్యలు తీసుకోవాలి. కాగజ్‌నగర్-ఈసుగాం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఇరుకు వంతెనతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

- రెడ్డి గోపి, కాగజ్‌నగర్

సర్‌సిల్క్ ఆస్తులు వేలానికి సిద్ధం

-20న ఈ- టెండరు ప్రక్రియ



మిల్లు స్థలానికి టెండరు కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కాగజ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్‌సిల్క్ భూములు వేలం పాట నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిల్లు మూత బడిన తర్వాత తమకు బకాయిలు రావాల్సి ఉందని సర్‌సిల్క్ కార్మికులు 2005లో హైకోర్టులో కేసు వేయగా, భూముల అమ్మకాలు జరిపి కార్మికులు బకాయిలు చెల్లించాలని 2008లో హైకోర్టు లిక్విడేటర్‌ను నియమించింది. ఈ ప్రక్రియలో తొలి విడతలో మిల్లు ఖాళీ స్థలాలు అమ్మకానికి పెట్టేశారు. ఈ ప్రక్రియతో కార్మికులకు రావాల్సిన రూ.3 కోట్ల బకాయిలు తొలివిడతలో అందజేయగా, మిగిలిన బకాయిలు అందజేసేందుకు టెండరు ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిల్లుకు సంబంధించిన 48.23 ఎకరాలను బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 17లోగా రూ.5.33కోట్లు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 18న బిడ్ సబ్ మిట్ చేసిన వారికి ఈ నెల 20న నిర్వహించే ఈ- వేలం పాటలో పాల్గొనేందుకు అర్హులుగా నిర్ణయించారు. వేలం పాటలో పాల్గొనే వారికి ప్రత్యేక ఐడీ నంబరు కేటాయించనున్నారు. కాగా ప్రభుత్వం వేలం రూ.53.33 కోట్ల నుంచి ప్రారంభం కానుంది. మిల్లులోపని చేసిన 3, 745 మంది కార్మికలకు గ్రాట్యూటీ డబ్బులు అందజేయనున్నారు. మిల్లు పునరుద్ధరణకు ఐడీబీఐ నుంచి రుణం పొందారు. ఈ రుణం కూడా చెల్లించాల్సి ఉంది.

పుస్తెల తాడు అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ భాస్కర్

నస్పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని సుందరయ్య కాలనీ వార సంత వద్ద నడి రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం చైన్ స్నాచర్లు ఓ మహిళ మెడలోని పుస్తెల తాడును అపహరించారు. పట్ట పగలు జరిగిన సంఘటనతో స్థానికంగా కలకలం రేపింది. సంఘటన స్థలాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు చెవెళ్ల సరస్వతి, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం... విద్యా నగర్‌లోని ఓ స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న సరస్వతి మధ్యాహ్నం గణేష్ నగర్‌లోని తన నివాసానికి వెళ్తోంది. స్కూల్ నుంచి కొద్ది దూరం వెళ్లగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి ఆమెను అడ్డగించి మెడలో ఉన్న పుస్తెల తాడును లాగే ప్రయత్నం చేశారు. రాకపోవడంతో ఓ వ్యక్తి జేబులో నుంచి కట్టర్ తీసి కట్ చేసుకుని స్కూటీపై పారిపోయారు. బాధితురాలు సరస్వతి కేకలు వేస్తూ పక్కనే ఉన్న అపార్టుమెంట్‌లోకి పరుగెత్తింది, ఆమె అరుపులు, కేకలు విన్న వారందరూ వచ్చేలోగా అప్పటికే నిందితులు పారిపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్సై ఉపేందర్ రావు సిబ్బందితో చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. జరిగిన సంఘటనను బాధితురాలు సరస్వతి డీసీపీ భాస్కర్‌కు వివరించింది. పోలీసులు చైన్ స్నాచర్ల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత

జన్నారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోటిగూడ గ్రామంలో పాలాజి సుధాకర్, పాలాజి భాస్కర్ ఇండ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపతో పాటు ఫర్నీచర్ తయారీకి ఉపయోగించే యంత్రాలను పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో సుష్మరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇద్దరి ఇళ్లలో అక్రమంగా కలప నిల్వ చేసి ఫర్నీచర్ తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకే దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో సీహెచ్‌పీ మోటార్‌తో పాటు కొత్త కట్టె కోత మిషన్‌తో పాటు కలప పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో లక్ష్మీనారాయణతో పాటు అటవీశాఖ సిబ్బంది సాగరిక, పోచమల్లు, శంకర్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడిన మహిళ

- తీవ్ర గాయాలు

జైపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో మహిళ బస్సు కింద పడి కాలు విరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన గుమ్మల రాజక్క ఆదివారం పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లింది. మంచిర్యాల నుంచి చెన్నూరుకు వెళ్లే బస్సులో ఎక్కింది. ఈ క్రమంలో మండలంలోని రాసుపల్లి వద్ద బస్సు దిగుతుండగా బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బస్సును ముందుకు పోనివ్వడంతో రాజక్క కింద పడడంతో ఆమె కాలు విరిగింది. దీంతో అక్కడున్న వారు ఆమెను చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలుకు అడుగులు

- నివేదికలు ఉన్నతాధికారులకు అందజేత
- త్వరలోనే రాజకీయాల పార్టీల అభిప్రాయ సేకరణ



కాగజ్‌నగర్‌లో రాజీవ్ గాంధీ చౌరస్తా

కాగజ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో మాస్టర్ ప్లాన్ అమలుకు అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మున్సిపాల్టీల అభివృద్ధికి రూ.25 కోట్ల నిధులతో చేపట్టిన అమృత్ 2.0 స్కీంలో కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ఎంపిక కావటంతో గత ఏడాది డ్రోన్ ద్వారా సర్వేలను చేపట్టారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ మ్యాప్ రూపొందించారు. 2040 సంవత్సరంలో పెరుగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని కావాల్సిన వసతులపై మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.నెల రోజుల క్రితం కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మున్సిపల్ అధికారులతో మాస్టర్ ప్లాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ అమలుకు తీసుకోవాల్సిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ ప్రక్రియ తర్వాత నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. ఇది పూర్తయితే త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశంలో ఆయా రాజకీయా పార్టీల నాయకుల అభిప్రాయాలను సేకరిస్తారు. ఆ తర్వాత రోడ్డు విస్తరణ ఎంత మేర చేపట్టాలి. కూడళ్ల విస్తరణ ఎంత ఉండాలి అనే అంశాలపై అధికారులు నివేదికలను రూపొందించనున్నారు.

● పూర్తయిన సర్వే..

ఈ ఏడాది జనవరిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా సర్వే చేశారు. దీన్ని ఆధారంగా పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం సర్వేలు చేసిన వాటిలో రద్దీ ఉండే ప్రదేశాలు, వార్డుల్లో అంతర్గత రోడ్ల వెడల్పు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. మాస్టర్‌ప్లాన్ లేక పోవడంతో ప్రస్తుతం పట్టణం అంతా కూడా అస్తవ్యస్తంగా ఉంది. మార్కెట్‌లో రద్దీ ఎక్కువ అవుతోంది. పండుగల పూట మరింత సమస్య జఠిలంగా మారుతోంది. మార్కెట్‌లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ సమస్య పెరిగి పోతోంది. పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో నిత్యం లోడ్ లారీలు వివిధ సరుకులతో అన్‌లోడింగ్ వస్తాయి. దీంతో ఉదయం పూట కూరగాయాలు కూడా కొనుగోలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధాన రోడ్లు కూడా పూర్తిగా గుంతలమయంగా మారడంతో నిత్యం వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే అన్ని సమస్యలు తీరే అవకాశాలున్నాయి. రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి ఎన్టీఆర్‌చౌరస్తా, రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి పొట్టి శ్రీరాములుచౌరస్తా, ఎన్టీఆర్‌చౌరస్తా నుంచి చెక్ పోస్టు, లారీ చౌరస్తా నుంచి వినయ్‌గార్డెన్ సమీపం వరకు రోడ్లు అధోగతికి చేరుకున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిండి పోతుండడంతో ప్రమాదాల చోటు చేసుకుంటున్నాయి. ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిత్యం ఆటోలు కూడా పద్ధతి ప్రకారం నిలుపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. పట్టణంలో పలు కాలనీల్లో ఇరుకు రోడ్లతో భారీ వాహనాలు పోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా మాస్టర్ అమలుకు అధికారులు త్వరితగతిన తగినచర్యలు తీసుకుంటే బాగుంటుందని పట్టణ వాసులు చెబుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా మాస్టర్ ప్లాన్ అమలు కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం పట్టణ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలను పంపించామని తెలిపారు.



రద్దీగా ఉన్న కాగజ్‌నగర్ మార్కెట్

కూరగాయల ధరలు పైపైకి



కెరమెరి వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కెరమెరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సామాన్యుల పై భారం పడుతోంది. పదిహేను రోజుల్లో ధరలు బాగా పెరిగాయని ఇలా అయితే ఏం తినాలని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఆదివారం జరిగే వార సంతలో ఏ ఒక్కటి కొన్న కిలో రూ.100 పైనే పలుకుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూరగాయలు పంటలు కుల్లిపోయి దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. కిలో బెండకాయ రూ.80, చిక్కుడు కాయలు రూ.100, అలుసంద రూ.80, పచ్చి మిర్చి రూ.120, క్యాబేజీ రూ.100, బీర కాయలు రూ.90, బీట్ రూట్ రూ.100, క్యారేట్ రూ.120, పాలకూర కట్ట రూ.25, మెంతికూర రూ.50 ఉన్నాయి. దీంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఓ వైపు వర్షాలు కురుస్తుండ దంతో దిగుబడులు తగ్గి కూర గాయల ధరలు అమాంతంగా పెరిగి పోయాయి. రోజురోజుకు ధరలు పెరిగిపోవడంతో సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలో కూరగాయాల సాగు అంతంత మా త్రంగానే ఉంది. వరుస నష్టాలతో ఏటేటా కూరగాయల సాగుకు రైతులు దూరమవుతున్నారు. పెట్టుబడులు పెరగడంతో కూరగాయల సాగుకు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో రైతులు కూరగాయల పంటలు సాగు చేసిన పంట నిల్వలకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో మార్కెట్‌లో పంటను తక్కువ ధరలకే విక్రయించాల్సిన పరి స్థితులు నెలకొన్నాయి. రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేసి హోల్‌సెల్ వ్యాపారులు ధరలు పెంచి చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీనికి తోడు జిల్లాలో పంటల సాగు తగ్గడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కొన్ని రకాల కూరగాయలను దిగుమతి చేసుకొని వ్యాపారులు చిరు వ్యాపారులకు విక్రయిస్తుండడంతో కూడా ధరలు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

బెజ్జూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత ఉందని కౌటాల వ్యవసాయాధికారి ప్రేమలత అన్నారు. ఆదివారం బెజ్జూరు మండలం ముంజంపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సప్తమ మహోత్సవంలో భాగంగా నాలోగో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాగడ హారతి

దహెగాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం అయినం గ్రామంలో శివపంచాయతన క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివా కాగడ హారతి నిర్వహించారు. పంచ పర్వదినాలలో భాగంగా నగర సంకీర్తన, కాగడ హారతి నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు తెలిపారు. ఉదయాన్నే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తే కార్తీక మాస ఫలాలు పొందవచ్చన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రాల నెపంతో ఒకరి హత్య

తిర్యాణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టగూడలో తమ కుటుంబ సభ్యులకు మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో శనివారం రాత్రి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హనుమంతరావు (50) తన కుటుంబ సభ్యులకు మంత్రాలు చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన సిడాం వినోద్ అనే వ్యక్తి కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్తున్న హనుమంతురావుతో వినోద్ గొడవ పడ్డాడు. అప్పటికే కోపంతో ఉన్న వినోద్ గొడ్డలితో హనుమంతరావు మెడపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన హనుమంతరావు భార్య ఉర్వేత బొజ్జుబాయిపై వినోద్ దాడి చేసేందుకు యత్నించాడు. దీంతో తప్పించుకుని భయంతో ఆమె ఇంట్లోకి వెళ్లింది. తీవ్ర గాయాలైన హనుమంతరావు అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతరావు భార్య ఫిర్యాదు మేరకు సీఐ సంజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

మందమర్రిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగులు ఎదుర్కొంటు న్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలకు సిద్ధమవుతున్నామని, దీనికి కార్మిక వర్గం కూడ కలిసి రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. ఏఐటీయుసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో విజిలెన్స్ వద్ద డిపెడెంట్ ఉద్యోగ కేసులు మూడు వేలకు పైగా ఉన్నాయని చెప్పారు. వాటి ని పరిష్కరించాలని చెప్పిన యాజమాన్యం పెడచెవిన పెట్టిందన్నారు. దీని వల్ల మెడికల్ అన్‌ఫిట్ అయిన కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సింగరేణి విజిలెన్స్ విభాగం అనుసరిస్తున్న విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ విషయాన్ని సింగరేణి సీఎండీ దృష్టికి తీసికెళ్లిన పరిష్కారం కావడం లేదన్నారు. మెడికల్ బోర్డు లేకపోవడం మూలంగా అనారోగ్యం బారిన పడిన ఉద్యోగులు పరిస్థితి ద యనీయంగా ఉందన్నారు. అనారోగ్యంతో సింగరేణి ఆసుపత్రుల్లో అన్‌ఫిట్ అయిన కార్మికులు తిరిగి 9 నుంచి 10 నెలల మధ్యన వెళితే ఫిట్‌పర్ సేమ్ జాబ్ ఇస్తున్నారని అన్నారు. 9 నుంచి 10 నెలల వేతనం నష్టపోయిన ఉద్యోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో కార్మిక సంఘాల మాటలు యాజమాన్యం ఖాతరు చేయడం లేదన్నారు. కార్మికుల సొంతింటి పథకంపై పదేపదే చెబుతున్న యాజమాన్యం పెడచెవిన పెడుతుందన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యమే చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఆ విషయంకు దాటవేస్తున్నారని అన్నారు. సింగరేణిలో మారు పేర్ల మార్పు విషయం ఊసే లేదన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా తాము ఒక నిర్ణయానికి వచ్చామని తెలిపారు. నవంబరు 6న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో కలువబోతున్నామని తెలిపారు. కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. సమావేశంలో మందమర్రి ఏరియా బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శిభీమనాథుని సుదర్శన్, చిప్ప నర్సయ్య, నాయకులు దాగాం మల్లేశ్, అక్బర్ అలీ, కంది శ్రీనివాస్, సోమిశెట్టి రాజేశం, రమణ, వెంకటేశ్వర్లు, ఎగ్గటి రాజేశ్వర్‌రావు, భూపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శిగా మారుతి



నియామకపత్రం అందుకుంటున్న మారుతి

శ్రీరాంపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శిగా బరపటి మారుతిని నియమిస్తూ ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ బి. జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అ నంతరం ఆయనకు నియామకపత్రం అందించారు. మారుతి యూనియన్ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని, అందుకే ఆయనకు కేంద్ర కార్యదర్శి పదవి ఇచ్చినట్లు జనక్‌ప్రసాద్ చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో పదవిని ఇచ్చినందుకు బరపటి మారుతి కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

మందమర్రిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఏరియా ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల గైర్హాజరుకు సంబంధించి యాజమాన్యం తీసుకువచ్చి 150 మస్టర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యో గాల పరిష్కారం కోసం ఆందోళనలు చేపట్టాలన్నారు. సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నార్నారు. సింగరేణిలో అవసరం అయితే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని సమ్మె చేపట్టడానికి వెళ్తామని యాజ మాన్యంకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, దాగం మల్లేష్, రాజేశ్వర్‌రావు, రాజేశం, కంది శ్రీనివాస్, అక్బరలీ, మల్లయ్య పాల్గొన్నారు.

గైర్హాజరు పేరుతో కార్మికులను తొలగించే కుట్ర



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజబాబు

రెబ్బెన, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో గైర్హాజరు పేరుతో కార్మికులను తొలగించే కుట్ర జరుగుతుందని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు రాజబాబు అన్నారు. స్థానికంగా ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులను గైర్హాజరు పేరుతో విధుల నుంచి తొలగించే కుట్ర యజమాన్యం, గెలిచిన ఏఐటీయూసీతో కలిసి కొత్త నిబంధనలు ప్రవేశ పెట్టిందని అన్నారు. ఏడాదికి 150 మస్టర్లు ఉంటేనే కార్మికులను విధులలో కొనసాగించాలని లేని పక్షం లో ఇంక్రిమెంట్‌లు నిలుపుదల చేయడమే కాకుండా డిప్రమోషన్ చేసి కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించే విధంగా సర్క్యులర్‌ను నిలుపుదల చేయాల్సిన ఏఐటీయూసీ నాయకులు నోరు మెదపడం లేదన్నారు. సమావేశంలో ఓజియార్, శివారెడ్డి, ఉమామహేవవర్, కిష్టస్వామి, రాజశేఖర్, సంతోష్, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు బెంబేలు

● 150/200 మస్టర్లు లేకుంటే ఇంటికే ● సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం ● విరమించుకోవాలని కార్మిక సంఘాల విజ్ఞప్తి

శ్రీరాంపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల యాజమాన్యం జారి చేసిన సర్క్యులర్‌తో సింగరేణి ఉద్యోగులు బెంబేలేతుతున్నారు. సింగరేణిలో ఉద్యోగులకు నానాటికి భద్రత లేకుండాపోతోంది. ఓ వైపు కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు ఆగిపోయింది. దీనివల్ల వారసత్వ ఉద్యోగాలు రావడం లేదు. మరోవైపు ఏడాదికి 150/200 మస్టర్లు చేయకుంటే డిస్మిస్ చేస్తామంటూ సింగరేణి సర్క్యులర్ జారీ చేసింది. సింగరేణిలో క్లర్కులు, ఇంజనీర్ల ఉద్యోగాల కోసం నియామక ప్రక్రియ జరుగుతున్నా నూతనంగా కార్మికులను తీసుకుకో వడం లేదు. అయితే ఇప్పటికే పనిచేస్తున్న వారి వారసులకు అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భా గంగా అనారోగ్య కారణంతో మెడికల్ ఇన్‌వ్యాలిడే షన్ అయితే సంబంధిత ఉద్యోగి వారసులకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రక్రియలో ముఖ్యమైన మెడికల్ బోర్డు ఈ ఏడాది మార్చి నుంచి ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికే ఎంపికై ఉన్న 373 మందికి వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు.

అండర్‌గ్రౌండ్ గనులు మూత..

సింగరేణిలో నానాటికి అండర్‌గ్రౌండ్ గనులు మూతపడుతున్నాయి. నూతన గను లు రావడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసినా ఉపరితల(ఓసీపీ) గనులే ఉంటున్నాయి. పైగా అందులోనూ ఓబీ, బొగ్గు ఉత్పత్తి ప్రైవేటు కాంట్రాక్టర్లే చేపడుతున్నారు. అందులో సింగరేణికి చెందిన పర్మనెంటు ఉద్యోగులు పదుల సంఖ్యలోనే ఉంటారు. ఈ క్రమంలో మూత పడుతున్న గనుల్లోని సిబ్బందిని ఇప్పటికైతే సర్దుబాటు చేస్తు న్నారు. కానీ వారంతా అదనంగా ఉన్నారని కంపెనీ భావిస్తోంది. ఈ తరుణంలో వారసత్వంగా నూతన ఉద్యోగులను తీసుకొని ఏం చేయాలని యాజమాన్యం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఇంత మంది ఉన్నా..

ఏ సంస్థకైనా మానవ వనరులు అవసరం. వాటిని సక్రమంగా వినియోగించు కుంటేనే సంస్థ ప్రగతిపథంలో నడిచి లాభాల బాట పడుతుంది. కానీ సింగరేణిలో భిన్నమైన పరిస్థితి ఉంది. తగినంత మంది సిబ్బంది, వారానికి ఆరు పనిదినాలు ఉన్నప్పటికీ ఉద్యోగుల గైర్హాజరుతో అనుకున్న మేర లక్ష్యాలను చేరడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వారసత్వ నియామకాల ద్వారా వచ్చిన ఉద్యోగులు యువజనులే ఉంటారు. కానీ వారు ఎక్కువ శాతం విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తిని వెలికితీయడంలో సంస్థ లక్ష్యాలను చేరుకోవడం లేదు. దీంతో యాజమాన్యం అనేక ప్రయత్నాల ద్వారా అనుకున్న బొగ్గు ఉత్పత్తిని తీయాలని ప్రయత్నం చేస్తోంది. మరోవైపు యాజమాన్యం మానవతా ధృక్పథంతో గైర్హాజరు కార్మికులకు స్థానిక అధికారుల ద్వారా గనులు, విభాగాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ విధులకు హాజరు కావాలని సూచిస్తోంది. వ్యక్తిగతంగా, ఆర్థికంగా కుటుంబానికి కలిగే నష్టాన్ని వివరిస్తున్నారు. కానీ అనుకున్న మేరకు ఫలితం రావడం లేదు.



గతంలో ఏడాదికి వంద..

గతంలో ఏడాదిలో కనీసం వంద మస్టర్లు ఉంటే విధుల్లో కొనసాగించేవారు. అంటే సుమారుగా వారానికి 2, నెలకు 8 మస్టర్ల లెక్కన పనిచేయాలి. కానీ బయట ఉన్న పని పరిస్థితులకు, సింగరేణిలో ఉండే విధానానికి అలవాటు కాకపోవడంతో చాలా మంది కార్మికులు వాటిని కూడా చేరడం లేదు. ఈ తరుణంలో వంద మస్టర్లు పూర్తి చేయనివారు కంపెనీకి అవసరమా అని యాజమాన్యం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కాగా ఇటీవల సింగరేణి విడుదల చేసిన నూతన సర్క్యులర్‌లో ఏడాదిలో కనీసం 150/200(అండర్‌గ్రౌండ్/సర్ఫేస్) మస్టర్లు ఉండాలని నిర్దేశించారు. ఈ ప్రకారం ఉద్యోగులు వారానికి మూడు రోజులు, నెలకు 12 రోజులు పనిచేయాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా..

ఏడాదిలో 150/200 మస్టర్లు పనిచేయని ఉద్యోగులపై తీసుకునే చర్యల గురించి యాజమాన్యం సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. 150/200 మస్టర్ల కంటే తక్కువగా ఉంటే మొదటిసారి తప్పు చేసిన ఉద్యోగికి యాజమాన్యం హెచ్చరికతో కూడిన లేఖ ఇచ్చి, 10 రోజులకు మించకుండా వేతనం లేని సస్పెన్షన్‌ను జారీ చేస్తారు. రెండోసారి తప్పు చేస్తే ఒక ఇంక్రిమెంట్‌ను నిలిపివేస్తారు. ఇది తర్వాతి ఇంక్రిమెంట్లపై ప్రభావం చూపదు. 100/150 మస్టర్ల కంటే తక్కువగా ఉంటే మొదటిసారి తప్పు కింద రెండు ఇంక్రిమెంట్లు శాశ్వతంగా నిలుపుదల చేస్తారు. ఇది భవిష్యత్తు ఇంక్రిమెంట్లపై ప్రభావం చూపుతుంది. రెండో సారి తప్పు చేస్తే ప్రస్తుత గ్రేడ్ నుంచి కింది గ్రేడ్‌కు డిమోట్ చేస్తారు. మూడోసారి అలాగే ఉంటే ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తారు. ఒక ఏడాదిలో పూర్తిగా గైర్హాజరైతే (జీరో మస్టర్స్) కిందిస్థాయి గ్రేడ్‌కు మారుస్తారు. వరుసగా రెండేళ్లు, అంతకన్నా ఎక్కు కాలం విధులకు రాకపోతే ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తారు. ఈ నిబంధనలను పరిశీలిస్తే తరచూ గైర్హాజరయ్యే కార్మికుల ఉద్యోగాలకు ఎసరు వచ్చే అవకాశం ఉంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

బెల్లంపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు అన్నారు. ఆదివారం పట్టణంలోని 31 వ వార్డులో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికి ప్రోసిడింగ్ పత్రాలు అందజేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి ఇల్లు రాలేదని కాంగ్రెస్ హయాంలో నే పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్ కుమార్, శ్రావణ్, రమాకాంత్, నాయకులు శ్యాంబాబు, శ్రీను, లక్ష్మన్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

జన్నారం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కారాజుల రాజేందర్ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రగాయాలపాలై కోమాలో ఉండడంతో రాంపూర్ గల్ఫ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య ఆధ్వర్యంలో రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తికి సాయపడాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సిరికొండ వెంకటేశ్‌లు పాల్గొన్నారు.



- పనుల కోసం జిల్లా కేంద్రానికి వలస వస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు
- ఇతర జిల్లా అధికారులు సైతం జిల్లా కేంద్రం నుంచే విధుల నిర్వహణ
- అద్దె ఇళ్లకు పెరిగిన డిమాండ్

మంచిర్యాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మం చిర్యాల నగర పాలక సంస్థ కేంద్ర పరిధిలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగిపోయింది. జిల్లా కేంద్రం కావడంతో స కల సౌకర్యాలు ఉండడంతో ప్రతీ ఒక్కరు మంచిర్యాల జిల్లా కేంద్రంలోనే ఉండేందుకు ఇష్టపడుతున్నారు. మం చిర్యాల జిల్లాలో పారిశ్రామిక కేంద్రాలే కాకుండా వివిధ షాపింగ్ మాల్స్ అధికార కార్యాలయాలు ఉండడం వ ల్ల గతం కంటే అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు నూతన గృహాలు నిర్మిస్తే ఆదాయపు పన్ను మిన హాయింపు ఉండడం వల్ల సింగరేణి ఉద్యోగులు ఇంటి రుణాలు తీసుకొని నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్నా రు. స్థిరాస్తి ఒక హోదా అనుకునే వారు, అలాగే ఆదాయం కూడా రావడంతో ఎక్కువ మంది ఇళ్లను నిర్మించి అద్దెకిస్తూ ఆదాయం పొందే మార్గాలను ఎంచుకుంటున్నారు.

వివరాలు తెలుసుకుంటే మంచిది...

అద్దె ఎంత అయినా పర్వాలేదు. అడ్వాన్స్ ఎంత అయినా ఇస్తాం. మా సొంత ఇల్లులా చూసుకుంటాం అంటూ కిరాయికి చేరే ముందు తియ్యని మాటలు చెవికి తాకగానే చాలా మంది ఇప్పుడే చేరిపో అంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. గేటుకు వేలాడే టూ లెట్ బోర్డును ఎప్పుడెప్పుడు తీసేయాలా అనే తొందరలో వచ్చిన వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోకుండానే తా ళాలు అప్పగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ఉ త్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెంది న వారు పని కోసం జిల్లా కేంద్రానికి వస్తున్నారు. అద్దె కోసం వచ్చిన వారిని వారు ఎలాంటి వారు అని చూడకుండానే ఇల్లు ఖాళీ ఉంటే అద్దె వస్తుందనే ఆలో చనతో ఎవరికి పడితే వారికి ఇంటి యజమానులు అ ద్దెకిస్తున్నారు. వారు చెప్పే మాయ మాటలు నమ్మి ఇం టిని అప్పగించి తీరా మోసపోతున్నారు. అకస్మాత్తుగా పోలీసుల నుంచి ఫోన్ కాల్ వచ్చినప్పుడు తాము పొర పాటు చేశామని గుర్తిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగలేక తల పట్టుకున్న సంధర్భాలు ఉన్నే ఉన్నాయి. కొందరు ఒక అడుగు ముందుకు వేసి యజమానులను బెదిరిస్తూ నెలల తరబడి సొమ్ములు చెల్లించకుండా తిరుగుతున్నారు. మరి కొందరు అద్దె డబ్బులు అడిగినప్పుడు కులం, మతం పేరుతో ద్వేశించారని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించారంటూ బుకాయిస్తూ కేసులు పెట్టిన సంధర్భాలు కూడా లేకపోలేదు.

జిల్లా కేంద్రంలో కొన్ని సంఘటలు..

మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని కొందరు వ్యక్తులు వ్యభిచారా న్ని నడిపారు. పోలీసులకు అనుమానం వచ్చి రైడ్ చే యడంతో వారి గుట్టు రట్టయింది. మంచిర్యాల పట్టణం లోని సూర్య నగర్‌లో ఒకరు కుటుంబంతో ఉన్నట్లు న మ్మించి ఇంటిని వ్యభిచార గృహంగా మార్చాడు. పోలీ సుల తనిఖీల్లో బండారం బయట పడడంతో వారితో పాటు ఇంటి యజమానికి సైతం పోలీసులు నోటీసు లు జారీ చేశారు.

జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వారు ఇంట్లో పాన్‌లు తింటూ సిగరేట్లు తా గుతూ గోడలపై ఉమ్మివేస్తూ అపరిశుభ్రంగా మార్చా రు. శుభ్రం చేసి ఖాళీ చేయమని అడిగితే అద్దె చెల్లించకపోగా ఇంటిని మరింత అపరిశుభ్రంగా మార్చారు. ఈ విషయం పంచాయతీ వరకు వెళ్లింది.

యజమానులు జాగ్రత్తలు పాటించాలి..

- పట్టణ సీఐ ప్రమోద్‌రావు



ఇంటి యజమానులు అద్దెకు దిగిన వారి ఆధార్ కా ర్డుతో పాటు పూర్తి వివరాలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రా ల నుంచి వస్తే వారి పూర్తి సమాచారాన్ని పోలీస్‌స్టేష న్‌కు అందజేయాలి. తెలిసిన వారికి అద్దె ఇస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండవు. ఇంట్లో ఉన్న వారిపై ఎలాంటి అనుమానాలు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలి.

సీఎం వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ రాస్తారోకో

తాండూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ సింధూర్‌పై దేశ సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలోని ఐబీలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సైనికులు కుటుంబాలను వదిలివేసి దేశం కోసం ప్రజల కోసం సేవ చేస్తుంటే వారిని అవమానిస్తూ సీఎం వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లిహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని మట్లాడడం కాంగ్రెస్ పార్టీ ఓటమికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్‌గౌడ్, అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు తిరుపతి, మల్లేష్, కుమార్, విగ్నేష్, కుమార్, రాజేశం, చందు, శ్రావణ్ పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి


పార్టీలో చేరిన కరచాలనం చేస్తున్న బీఎస్‌పీ నాయకులు

బెల్లంపల్లి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు రవీందర్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, సెంట్రల్ కోఆర్డినేటర్ రాంచందర్‌లు అన్నా రు. ఆదివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బహుజన్ సమాజ్ పార్టీలో చేరారు. పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం నూతనంగా చేరిన కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా బహుజన సమాజ్ వాది పార్టీ ముందుకు వెళ్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దాగాం శ్రీనివాస్, కిరణ్‌బాబులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న నాల్గవ తరగతి ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సర్వ సభ్య సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్‌గా 25 ఏళ్లు గడిచినా ప్రమోషన్‌లు లేక పదవీ విరమణ చెందుతున్నారని తెలిపారు. ఆఫీసు సబార్డినేట్‌ల, రిటైర్‌మెంట్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. పీఆర్‌సీ అమలు చేయాలని, ఐదు డీఏలను చెల్లించాలన్నారు. నాయకులు శేఖర్, సతీష్, కవితరాణి, సుజాత, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రార్థనలు

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం రాత్రి సమాధుల పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సింగరేణి పాఠశాల వెనకాల ఉన్న క్రైస్తవుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, రాజశేఖర్, పద్మారావు, శామ్యూల్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని మీర్జంపేటలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు శనివారం రాత్రి గ్రామానికి చెందిన రామంచ సురేందర్(42) రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా షబీర్ అనే కారు డ్రైవర్ అతివేగంగా నడిపి సురేందర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేందర్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందాడు.

మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం


బండి సదానందంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : లారీ ఓనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, త్వరలోనే కార్మిక ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్తానని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఇందు గార్డెన్‌లో నిర్వహించిన లారీ ఓనర్ల సమావేశంలో మాట్లాడారు. ఏరియాలో కొన్ని గనులు మూత పడడం వల్ల లారీ ఓనర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలా మంది అప్పులు చేసి లారీలను కొనుగోలు చేసి ట్రాన్స్‌పోర్టు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీ ఓనర్ల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం లారీ ఓనర్లు బండి సదానందంకు విన తిపత్రం అందించారు.

లారీ ఓనర్ల కమిటీ ఎన్నిక

లారీ ఓనర్ల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అడహక్ కమిటీ చైర్మన్‌గా కాదర్ బాయ్, వైస్ చైర్మన్ రహమత్‌బాయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సలీం, తాజ్, ముజాయిద్, రీందర్, శ్రీనివాస్, కిషన్, ఓం ప్రకాష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలు

జన్నారం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు గురువయ్య, శ్రీనివాస్, హరీశ్‌లు పాల్గొన్నారు.

రహదారి సమస్య తీరెదెన్నడో..?

(5వ పేజీ తరువాయి)

ప్రజలు కూరగాయల మార్కెట్, వివిధ షాపింగ్‌ల నిమిత్తం బెల్లంపల్లి చౌరస్తా మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోడ్డు సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చొరవ తీసుకోని వైనం...

బెల్లంపల్లి చౌరస్తాలో నెలకొన్న సమస్యను పరిష్కరించడంలో దశా బ్దాల కాలంగా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీ సుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. స్థలం యజమాని 1970లో సదరు భూమిని కొనుగోలు చేశాడు. అనంతరం 1973లో మున్సి పాలిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. మాస్టర్ ప్లాన్‌కు ముందే స్థలం కొనుగోలు చేసినందున న్యాయబద్ధంగా యజమాని కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా యజమానికి నష్టపరిహారం చెల్లించి స్థలం సేకరించాలని మున్సిపాలిటీకి సూచించింది. దీంతో సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టీ పట్టనట్లు వ్యవహించారు. ఇదిలా ఉండగా దాదాపు మూడున్నరేళ్ల క్రితం సమస్యను పరిష్కరించేందుకు మున్సి పల్ అధికారులు కొంతమేర ప్రయత్నించారు. భూ యజమానితో మాట్లాడటం ద్వారా నష్టపరి హారం తీసుకొనేలా ఒప్పించగలిగారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ (ప్రభుత్వం ధర) విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ఫైలును కలెక్టర్ ఆమోదం కోసం కూడా పెట్టారు. అయితే ఖరీదైన స్థలం కావడం, రూ. 6 కోట్ల మేర చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో అప్పటి కౌన్సిల్ అభ్యంతరం తెలపడంతో ఆ ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. అయితే సమస్యను పరిష్కరించడంలో జాప్యం కారణంగా.... యజమాని అది ప్రైవేటు భూమి అని, ఆక్రమణ చేయడం చట్ట విరుద్ధమంటూ అప్ప ట్లో రోడ్డు మధ్యలో అడ్డంగా బోర్డు ఏర్పాటు చేశారు. అయినా మున్సి పాలిటి నుంచి స్పందన లేక పోవడంతో యజమాని తిరిగి రోడ్డుకు అడ్డంగా సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఆ తరువాత సిమెంట్ స్తంభాలు తొల గించినప్పటికీ రోడ్డు సమస్య ఎప్పటిలాగే ఉంది. మంచిర్యాల నగరం మున్సిపల్ కార్పొరేషన్‌గా మారినందున ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో యువకుడు

రూ.87 వేలు పోగొట్టుకున్న వైనం

సారంగాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :సైబర్ వలలో చిక్కుకొని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపెల్లి పోతారం గ్రామానికి చెందిన బద్ది రాకేష్ అనే యువకుడు రూ.87 వేలు పోగొట్టుకున్నాడు. పోతారం గ్రామానికి చెందిన బద్ది రాకేష్ అనే యువకుడు జీవనోపాధి కోసం పది రోజుల క్రితం ఇరాక్ వెళ్లాడు. అయితే రాకేష్ ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ మెస్సేజ్‌కు లైక్ కొట్టాడు. యూట్యూబర్ హర్షసాయి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించిన సైబర్ నేరగాళ్లు రాకేష్‌తో పరిచయం పెంచుకున్నారు. రాకేష్‌కు నమ్మకం కలిగించేలా హర్షసాయి పేరుతో ఉన్న ఆధార్‌కార్డు పంపించి నీ అప్పులు తీర్చడం కోసం రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తామని నమ్మించారు. అనంతరం ఫోన్‌పే ద్వారా రూ.6.5 లక్షలు పంపించినట్లు నకిలి స్క్రీన్ షాట్ పంపించారు. మీరు పంపించిన డబ్బులు తనకు అందలేదని రాకేష్ అడగడంతో అందుకు ట్యాక్స్ రూపంలో డబ్బులు చెల్లించాల్సి వస్తుందని నమ్మించారు. మోసగాళ్ల మాటలు నమ్మిన రాకేష్ ఆశతో ఇండియాలో ఉన్న తన కుటుంబ సభ్యుల ఖాతా నుంచి విడతల వారీగా రూ.87 వేలు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పంపించాడు. ఇంతటితో ఆగని సైబర్ మోసగాళ్లు ఇంకా డబ్బులు పంపించాలని లేని పక్షంలో డిజిటల్ అరెస్ట్ ఉంటుందని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో మోస పోయానని గుర్తించిన రాకేష్ తనకు న్యాయం చేయాలని సైబర్ క్రైం పోలీసులను వేడుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని దుమాల గ్రామానికి చెందిన వ్యక్తి జాలపల్లి అంజయ్య(34) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అంజయ్య పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనంపై గ్రామశివారులోని ఓ పంపులో పెట్రోలు పోయించుకునేందుకు వెళుతున్నాడు. నిజామాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కామారెడ్డి నుంచి రాచర్లగొల్లపల్లి మీదుగా కరీంనగర్ వెళుతున్న క్రమంలో అంజయ్య బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుస్మిత ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఐటీయూ మహాసభల పోస్టర్ల విడుదల


మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

లక్షెట్టిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని విశ్రాంతి భవనంలో సీఐటీయూ జిల్లా మహాసభల పోస్టర్లను ఆపార్టీ నాయకులు ఆదివారం విడుదల చేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటి కూడా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కార్మికుల పక్షాన ఉండి కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఎప్పుడు ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. ఈ నెల 15,16 తారీకుల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కార్మికులు లచ్చవ్వ, శంకరవ్వ, సునీత, సాగర్, రాజలింగు, రాజన్న పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్ మండల కేంద్రంలోని హమాలీ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ 3వ జిల్లా మహాసభల కరపత్రాలను ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15,6 తేదీల్లో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ప్రధాని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు కోసం పోరాటాలు చేయాలని కార్మికులను హక్కులను రక్షించుకోవాలన్నారు. మహాసభల్లో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకె రవి, దాగం రాజారాం, మహ్మద్ అక్బరలీ, లక్ష్మణ్, మల్లేష్, శ్రీను, స్వామి, శంకర్, రాగులయ్య, శంకర్, రాగులు, రాజయ్య, తిరుపతి, రమణ పాల్గొన్నారు.

16న మునీర్ స్మారక రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నస్పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ జర్నలిస్టు మునీర్ జ్ఞాపకార్థం ఈ నెల 16న నస్పూర్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు వీ కరాటే అండ్ ఫిట్నెస్ ఆకాడమీ నిర్వహకుడు పోచంపల్లి వెంకటేష్ తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మునీర్ సోదరుడు, న్యాయవాది సంధాని, మునీర్ కుమారుడు మయూర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మునీర్ స్ఫూర్తితో యువత అన్ని రంగాల్లో రాణించాలనే ఉదేశ్యంతో కరాటే పోటీలను ఏర్పాటు చేసామన్నారు. ఒక క్రీడా కారుడి ఆశయాలను నెరవేరడానికి యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. నస్పూర్‌లో 16న జరిగే 5 రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే కుంగ్ ఫ్యూ చాంపియన్ షిప్-2025లో పాల్గొ న్నాలన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకుడు అబ్బాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంఢ్ల శ్రీనివాస్, లెక్కల విజయ్, కరాటే అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, పెద్దపల్లి మహేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు

చెన్నూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులను వేధిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్ పేర్కొన్నారు. మున్సిపల్ కమి షనర్ తీరుకు నిరసనగా ఆదివారం చెన్నూరులో చిరు వ్యాపారాలు నల్ల బ్యాడ్జీలు ధరించి బస్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు శాంతి యుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు మున్సిపాలిటీలో చలికాలం దుప్పట్లు, చెద్దర్లు, స్వెట్టర్లు అమ్ముకునే చిరు వ్యాపారులను వ్యాపారం చేసుకోనివ్వకుండా కమిషనర్ అడ్డుకుంటున్నారని తెలిపారు. బతుకు దెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి వలస వచ్చి దుప్పట్లు, స్వెట్టర్లు అమ్ముకుంటున్న వారిని పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలని లేకుంటే వ్యాపార సామగ్రిని జేసీబీతో చెత్త డంప్‌యార్డుకు తరలిస్తానని వేధిస్తున్నాడన్నారు. వెంటనే దీనిపై కలెక్టర్ విచారణ జరిపి మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌మహాదేవ్, రాజమల్లు, రాజు, మధ్యప్రదేశ్ వ్యాపారులు విజయ్, సాగర్, కిరణ్, మహేష్ పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బిసగోని చంద్రయ్య, మొగిలిపాక చంద్రయ్య, బోండ్ల లక్ష్మణ్ అనే వ్యక్తులపై పిచ్చి కుక్క దాడి చేయడంతో బాధితులను వైద్య చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన కుక్కను స్థానికులు చంపివేశారు. గ్రామంలో విచ్చలవిడిగా కుక్కలు తిరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు గ్రామపంచాయతీ పక్షాన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పిల్లలు బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారన్నారు.

వీధి వ్యాపారులకు పునరావాసం కల్పిస్తాం

బెల్లంపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారి వెడల్పులో నిరాశ్రయులైన పలువురి వీధి వ్యాపారులకు పునరావాసం కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. నియోజకవర్గం కేంద్రంగా ఉన్న బెల్లంపల్లి పట్టణంలో వాహనదాల రద్దీతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం చేపడుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణ అభివృద్ధితో పాటు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగాయన్నారు. రోడ్డు విస్తరణలో వీధి వ్యాపారులు కోల్పోయిన షాపుల నిర్వాహకులకు అంబేద్కర్ చౌరస్తాలోని పాత సీఎస్‌పీకి చెందిన స్థలంలో పునవాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. పట్టణ అభివృద్ధికి వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలి

శ్రీరాంపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాహన డ్రైవర్లు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించవద్దని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దన్నారు. వాహన కండీషన్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందని, తొందరపాటుతనంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు రహదారి భద్రతపై అవగాహన సదస్సు

హాజీపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామ రహదారి భద్రతా కమిటీ ఏర్పాటు, రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హాజీపూర్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎగ్గడి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఈ కార్యక్రమంలో రెవెన్యూ, రవాణా, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ, విద్య, వైద్య శాఖల అధికారులు పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచనలు, అవగాహన కల్పించనున్నారని తెలిపారు. సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రహదారి సమస్య తీరేదెన్నడు?

ప్రైవేటు స్థలమంటూ గతంలో యజమాని ఏర్పాటు చేసిన బోర్డు

- సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- భూ సేకరణలో తాత్సారం
- దశాబ్దాల పాటు కొనసాగుతూనే ఉన్న చర్చలు
- ప్రైవేటు స్థలమంటూ బోర్డు ఏర్పాటు

మంచిర్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల రహదారి సమస్యకు పరిష్కారం చూపడంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రైవేటు స్థలం అయినందున రోడ్డు ఏర్పాటుకు అడ్డంకులు కలుగుతుండగా, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో రహదారి సమస్య పుర: ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా బెల్లంపల్లి చౌరస్తాలో మాత్రం రోడ్డు నిర్మాణానికి తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. బెల్లంపల్లి చౌరస్తా నుంచి పడమర వైపున ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఇస్లాంపురలో ప్రయాణించేందుకు సరియైన రహదారి లేదు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం చౌరస్తాలో అందు బాటులో ఉన్నప్పటికీ అది ప్రైవేటు భూమి కావడంతో పనులు చేపట్టడంలో యంత్రాం గానికి బ్రేకులు పడుతున్నాయి. స్థలానికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండటంతో పరిష్కారం దిశగా ఆలోచనలు చేసేందుకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధి కారులు చొరవ తీసుకోవడం లేదు. దీంతో బెల్లంపల్లి చౌరస్తాలో తరుచుగా ట్రాఫిక్ జాం అయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన రోడ్డు కావడంతో ఇరువైపులా వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

● నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని...

బెల్లంపల్లి చౌరస్తాలో ఇస్లాంపుర వైపు ఉన్న రోడ్డును విస్తరించాలంటే స్థలం యజమాని అంగీకారం తప్పని సరి. ప్రైవేటు భూమి కావడంతో నష్టపరిహారం చెల్లిస్తే గానీ పనులు ముందుకు సాగే పరిస్థితులు లేవు. ఈ విషయమై అనేక సార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చ జరిగినప్పటికీ కేవలం నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో అప్పటి పాలక వర్గాలుగానీ, అధికారులుగానీ చొరవ చూపలేదు. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారు కాగా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాధనం ప్రజల కోసం ఖర్చు చేయడంలోనూ తాత్సారం చేయడంతో అప్పట్లో తేలికగా పరిష్కారం అయ్యే సమస్య ప్రస్తుతం జఠిలమై కూర్చుంది. మంచిర్యాల పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ తరువాత దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందడంతో నగరంలో జన సంచారం కూడా విపరీతంగా పెరిగింది. ప్రధాన రహదారులు ఎప్పుడు రద్దీగా ఉంటున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న బెల్లంపల్లి చౌరస్తా అత్యంత ముఖ్యమైన కూడలి. ఈ కూడలి ద్వారా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు వెడల్పు అనివార్యం అయింది. అంతేకాకుండా ఇస్లాంపుర ప్రస్తుతం మెడికల్ హబ్‌గా మారింది. ఆ ప్రాంతంలో పదుల సంఖ్యలో వివిధ ప్రత్యేకతలు గల ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. నిత్యం వందల సంఖ్యలో రోగులు, వారి కుటుంబీకులు బెల్లంపల్లి చౌరస్తా మీదుగానే ఆసుపత్రులకు వెళ్తుంటారు. అలాగే రాళ్లపేటలోని రోడ్డు నెంబరు 1 నుంచి మొదలుకొని 5 వరకు నివాసం ఉంటున్న..

(తరువాయి 7లో)

రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా మార్కెటింగ్ ఏడీ షహాబొద్దీన్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : జిల్లాలో పత్తి కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయి ?

మార్కెటింగ్ ఏడీ : జిల్లాలో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్ మహేశ్వరి జిన్నింగ్ మిల్‌లో కలెక్టర్ సోమవారం కొనుగోళ్లు ప్రారంభిస్తారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు ?

మార్కెటింగ్ ఏడీ : జిల్లాలో పది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్‌లో 3, మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట వెంకటసాయి జిన్నింగ్ మిల్, చెన్నూరు నియోజకవర్గంలో 6 కొనుగోలు కేంద్రాలు సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి : తేమ శాతంతో రైతులకు ఏమైనా ఇబ్బందా ?

మార్కెటింగ్ ఏడీ : సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చే రైతులు ఆరబెట్టి తీసుకురావాలి. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తాం. అంతకు మించి తేమ ఉంటే కొనుగోలు చేయడానికి సీసీఐ అంగీకరించదు. 8 శాతం మించితే ఒక్కో శాతానికి 81 రూపాయి తక్కువ ధర లభిస్తుంది. 8 శాతం తేమ ఉన్న పత్తికి క్వింటాలుకు రూ. 8110 మద్దతు ధర పొందే అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేసే అవకాశం ఉంది ?

మార్కెటింగ్ ఏడీ : జిల్లాలో లక్ష 70 వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. ప్రాథమిక అంచనా ప్రకారం 12 లక్షల క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దానికి తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు తప్పకుండా కపాస్ కిసాన్ యాప్‌లో మొబైల్ నంబర్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని తేదీ, సమయం, కొనుగోలు చేసే సెంటర్‌ను నమోదు చేసుకోవాలి. కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మార్కెటింగ్ శాఖను సంప్రదించాలి.

-హాజీపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి)

బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధం

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : రామగుండం క మిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యంపై నిషేదాజ్ఞలు కొనసాగుతాయని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు సిటీ యాక్టు అమలులో ఉంటుందని, బహిరంగ ప్రదేశాలలో మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై ఫిర్యాదులు రావడంతో నిషేధం విధించామన్నారు. డీజే, డ్రోన్‌లపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించరాదన్నారు. ఏ కార్యక్రమం చేపట్టినా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముఖ్య అతిథులు

మంచిర్యాల క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 17 బాల బాలికల జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు ట్రినిటీ హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలకు 150 మంది క్రీడాకారులు పాల్గొనగా అధ్యక్షులుగా బిజ్జు కుర్విల్ల, పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా డైరెక్టర్ జూన్ క్రాని, అబ్జర్వర్ గోపాల్, కోచ్ సుదీష్, ఆచర్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలి

ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్

నెన్నెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో వంతశాతం ఫలితాలు సాధించేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గా ప్రసాద్ అన్నారు. విద్యార్థులు సైతం ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలని సూచించారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. వార్డెన్‌కు, సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. పదో తరగతి విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి అయ్యేలా చూసి పునశ్చరణ తరగతులు నిర్వ హించాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ట్యూటర్లను నియ మించుకొని వారికి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మెనూ అమలు గూర్చి వాకబు చేశారు. నూతన మెనూ ప్రకారం ఆహారం, శుద్ధజలం అందజేయాలన్నారు. హాస్టల్ పరిసరాలు, విశ్రాంతి గదులు, డైనింగ్‌హాల్, కిచెన్‌లను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వార్డెన్ జయశంకర్ ఉన్నారు.



మెనూ అమలు తెలుసుకుంటున్న డీడీ దుర్గా ప్రసాద్

భగవద్గీత పుస్తకాల పంపిణీ

దండేపల్లి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక లక్షెట్టిపేట కొడిమ్యాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దండేపల్లి మండలం ద్వారకలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు ఆర్ రాజు, రాజేష్‌లు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి రోజున ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా దీపాలు వెలిగించాలన్నారు. భగవద్గీత జ్ఞానం ప్రతి మనిషికి సంబంధించినన్నారు.

అనంతరం భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు భగవద్గీతల బుక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగిరెడ్డి, రవి, వేణు, రాజు, సత్యం, సందిప్, ప్రసాద్, సతీష్, నరేందర్, ఉమమ్మ, సునీత, నాగమణి, రవలి, రష్మిత, సాహిత్, అనుతేజ్, ఆదిత్య, రూపక్, శివాషు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున కాలనీలో పాముల సంచారం

●ప్రహరీ నిర్మించాలంటున్న కాలనీ వాసులు ●పనులు చేయించిన గుర్తింపు సంఘం నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగార్జున కాలనీలో విషసర్పాల సంచారం పెరిగిందని దీంతో తాముబయటకు రావాలంటే భయపడుతున్నామని కాలనీ వాసులు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గడిచిన వారం రోజుల్లో 15కు పైగా పాములు రావడంతో స్నేక్ క్యాచర్‌లకు సమాచారం ఇవ్వగా పట్టుకున్నారన్నారు. ఇటీవల 5 అడుగుల కట్ల పాము ఓ ఇంట్లోకి చొరబడగా దాన్ని కొట్టి చంపామని తెలిపారు. అతేకాకుండా సాయంత్రం వస్తే పాములు ఇంట్లోకి వస్తున్నాయని తెలిపారు. కాలనీ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని లేకుంటే తాము నివసించే పరిస్థితులు లేవని వాపోతున్నారు. రాత్రివేళ భయం భయంగా పడుకుంటున్నామని, చిన్న పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామన్నారు. వెంటనే సింగరేణి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ విషయాన్ని గుర్తింపు సంఘం నాయకుల దృష్టికి తీసుకు వెళ్లగా నాయకులు వర్క్‌షాపు డీజీఎం దూప్‌సింగ్‌తో మాట్లాడారు. బ్లేడ్ ట్రాక్టర్, జేసీబీ సహాయంతో చెత్తా, చెదారాన్ని తొలగించారు. నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలనీలో ప్రహరీ గోడ నిర్మిణం, విద్యుత్ దీపాలు, గేటు ఏర్పాటు చేసే విధంగా జీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.



పనులు చేయిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

పీడీఎస్‌యూ మహాసభల పోస్టర్ల విడుదల

లక్షెట్టిపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం పీడీఎస్‌యూ 23వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆ సంఘం నాయకులు విడుదల చేసారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లా డుతూ ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు వరంగల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర మహాసభలకు మన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, అభిమానులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయ కులు కార్తీక్, విజయ్, శ్రావణ్, జశ్వంత్ పాల్గొన్నారు.

వైభవంగా తులసీ కల్యాణం



గూడెం ప్రధానాలయంలో తులసీ కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ ముఖ్య అర్చకులు

దండేపల్లి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం లో ఆదివారం రాత్రి గోధూళి సముహూర్తాన తులసీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, అలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు గోవర్ధన సంపత్ స్వామి, అంజనేయస్వామిల అధ్వర్యంలో వేదమంత్రోచ్చారణ నడుమ తులసీ కల్యాణం వేడుకలను జరిపించారు. భక్తులు కుటుంబస మేతంగా తరలివచ్చి కల్యాణం తిలకించి, సత్యదేవుడిని దర్శించుకున్నారు.

ఖోఖో పోటీలకు ఏర్పాట్లు పూర్తి

భీమారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిస్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న జరిగే ఖోఖో పోటీలకు భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోటీల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ చేకుర్తి సరోజన సత్యనరాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కమిటీ కార్యదర్శి మారయ్యలు తెలిపారు. ఈ పోటీలను దివంగత చేకుర్తి రాజారెడ్డి, రాంబాయిల స్మారకార్థం నిర్వహిస్తున్న వారి కుమారుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు 1800 మంది క్రీడాకారులు 200 మంది పీడీ, పీఈటీలు హాజరవుతారన్నారు. ఈ పోటీలకు హాజరయ్యే వారికి భోజన వసతి కల్పించడంతో పాటు విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వహకులు తెలిపారు.



పోటీలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

గూడెం ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ



ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దండేపల్లి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని దండేపల్లి మండలం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో భక్తులతో కార్తీక సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినంకావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే సుమారు వేలాది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూ జల నడుమ గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకున్నారు. భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

గూడెం సత్యనారాయణస్వామి దేవాలయంలో నవంబర్ 3 నుంచి 5 వరకు కార్తీక పౌర్ణమి ప్రత్యేక కార్తీక ఉత్సవ పూజలు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

●3న కార్తీకశుద్ధ త్రయోదశి పురస్కరిం చుకుని విశ్వక్సేణ ఆరాధన, అంకురారోపణము, అగ్నిప్రతిష్ఠ, నిత్యహవనము, బలిహరణము.

●4న కార్తీకశుద్ధ చతుర్దశి పురస్కరించుకోని నిత్యహవణము, బలిహరణము .

●5న కార్తీక పౌర్ణమి రోజున నిత్యహవణము, బలిహరణము, మహాపూర్ణాహుతి, యజ్ఞపరిసమాప్తి, మహా దాశీర్వచనము, తీర్థప్రసాదవతరణ ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున రాత్రి 9గంటలకు సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన. కార్తీక పౌర్ణమి ఉత్సవాలకు దేవాలయాన్ని అన్ని హంగులతో ముస్తాబు చేస్తున్నారు.



స్వామి వారి ఉత్సవ విగ్రహాలు

అదుపు తప్పితే..అంతే సంగతులు

●ప్రమాదకరంగా రహదారి.. ●పట్టించుకోని అధికారులు



కొండాపూర్ యాప వద్ద గుంతలో నుంచి వెళ్తున్న లారీ

కాసిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ నుంచి సోమగూడెం వెళ్లే ప్రధాన రహదారి కొండాపూర్ యాప వద్ద గుంతలమయంగా మారింది. దీంతో ప్రతి రోజు వాహనదారులు అదుపు తప్పి నీటి గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణి కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేవాపూర్ నుంచి వివిధ ప్రాంతాలకు ఎక్కువగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రోడ్డు చెడిపోయి ప్రమాదకరంగా మారింది. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారి నీటి గుంతలను తలపిస్తోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక గుంతల్లో నీరు చేరింది. నీటితో ఉన్న గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు గుంతల్లోపడి అదుపు తప్పి కింద పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని రెండు నెలలుగా బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక యువకులు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.